# పరిష్కారం

అక్కడ.......

దేవాలయంలో శాస్త్రులుగారు 'రుక్మిణీ కళ్యాణం' పురాణం చెబుతూ ఆ లోకైకమూర్తి శ్రీకృష్ణ పరమాత్మను రుక్మిణీదేవి గాంధర్వవివాహం ఎలా చేసుకుందో భాగవతంలోని ఆ మధుర ఘట్టాన్ని కర్ణపేయంగా శ్రోతలకి వినిపిస్తున్నారు. చాలామంది అమ్మలక్కలు, ముసలివాళ్ళు తన్మయులై వింటు న్నారు. అందులో కామేశ్వరికూడా ఉంది. ఆమె మనసులో ఎదిగి గుండెలమీద కుంపటిలా కూర్చున్న వకుళ జ్ఞప్తికి వచ్చింది. దానికి పెళ్ళి చేయడం తనకొక తెగని సమస్య. ఆమె రామాన్ని తప్పిస్తే వేరొకరిని పెళ్ళాడనని భీష్మించుకు కూర్చున్నది. రామానికి వకుళ అంటే అమితమైన ప్రేమ ఉంది. అయితే, విశ్వనాధశాస్త్రిగారికి మటుకు కట్నం దాహం అధికంగా ఉండటం వలన వారి ఇద్దరి ప్రణయం వివాహానికి దారి తీసేటట్టు లేదు. రుక్మిణీలా తన కూతురుకూడా తన్ను గాంధర్వవిధిని పెళ్ళాడమని రామానికి సందేశం పంపకూడదా? దానికి ప్రత్యుత్తరంగా రామం ఆమెను తీసుకొనిపోయి రిజిస్టరు పెళ్ళి చేసుకోకూడదా – అనుకుంది. అంతలోనే ఆమె మనసు కలుక్కుమంది. ఈ కాలంలో అలాంటి పెళ్ళిళ్లను గాంధర్వవివాహా లనరు సరికదా లేచిపోయింది – అంటారు. ఛీ ఛీ! ఎంత అప్రతిష్ఠ! ఏమిటి తనకు ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయి?

ఆమె తిరిగి కథ వినడంలో మునిగిపోయింది.

ఇక్కడ.....

వంటింట్లో బొగ్గులకుంపటిమీద నీళ్ళుపడేసి, విసురుతూంది వకుళ.

గుమ్మంమీద రామం కూర్చుని వకుళలో ఏవేవో ఆశలు రేపుతున్నాడు. వకుళ ముభావంగా వింటూంది. నీళ్ళుమరగడం గమనించి, పంచదార, కాఫీపొడుంవేసి గిన్నె కిందకు దించి మూతపెట్టింది.

"అయితే వకుళా, నాతో వచ్చివేయడం నీకు ఇష్టం లేదా?" అంతవరకు తన ప్రస్తావన కేవిధమైన భావం తెలియచేయకపోవడంతో సూటిగానే ప్రశ్నించాడు.

కాఫీకప్పు రామానికందించి, "క్షమించు, రామం. నేనంత సాహసం చెయ్యలేను" అని ముక్తసరిగానే సమాధానమిచ్చింది.

ఇలాంటి జవాబునే ఊహించిన రామం నిరుత్సాహపడలేదు. తన ఉద్దేశాన్ని మరో మారు వెలిబుచ్చాడు.

"వకుళా, ఇందులో నువ్వు నష్టపోయేది ఏమీలేదు. నిన్ను ఇలా పెళ్ళి చేసుకున్నందువలన

నాకే నష్టం. మా నాన్న తన కోర్కెకు వ్యతిరేకంగా నిన్ను చేసుకున్నాననే కోపంతో ఆస్తిని ఏ దేవాలయానికైనా వ్రాసేయవచ్చు"

"నీకు న్యాయంగా రావలసిన ఆస్తి రాకపోవడం నీ కొక్కడికేనా నష్టం? నీ కాబోయే భాగస్వామిని కదిలోటుకాదా? ఎంత సంకుచితంగా ఆలోచిస్తున్నావు, రామం!" వకుళ నవ్వింది.

ఆమె మాటల్లోని సత్యాన్ని గ్రహించి రామం చిన్నబోయాడు.

"ఈ వివాహం చట్టసమ్మతమైతే అవునేమోగాని, సంఘం ఒప్పుకోదు. నన్ను లేచిపోయిన దానిగానే గుర్తించి అవమానపరుస్తుంది. ఇక లాభనష్టాల విషయం అరిటాకు మీద ముల్లుపడ్డా, ముల్లుమీద అరిటాకు పడ్డా అరిటాకుకే నష్టమని నీకు తెలియదా? రామం నువ్వు వెయ్యిచెప్పు, లక్ష చెప్పు లేచిపోవడం, 'పారిపోవటం నాకు సమ్మతం కాదు."

"వకుళా, అయితే నీకు నామీద నమ్మకంలేదా? పూర్వ కాలంలోనూ ఇలాంటివి చట్టసమ్మతాలే? వాటిని గాంధర్వ వివాహాలని పిలిచేవారు. రుక్మిణీ శ్రీకృష్ణుణ్ణి ఈ రీతిలోనేగా పరిణయమాడింది. రాణీసంయుక్త పెండ్లి ఎలా జరిగింది? రిజిస్టరు పెళ్ళిళ్లు ఇప్పుడెన్నెన్ని జరగటంలేదు? నువ్వు అనవసరంగా అనుమానిస్తూ కూర్చుంటే తరువాత విచారించవలసి వస్తుంది."

"పోనీలే, రామం. తప్పు చేసి విచారించే కన్నా ఏ తప్పు చేయ్యకుండా విచారించడమే మేలు."

"అయితే, నేను వెళ్ళివస్తా! నువ్వు ఎప్పటికైనా పశ్చాత్తాపపడక మానవు!"

రామం వెళ్ళిపోయిన వంక కొన్ని క్షణాలుచూసి తిరిగి తనపనిలో మునిగిపోయింది వకుళ.

అప్పుడు....

రామం వకుళ మీదనున్న మక్కువను మరువలేక, బలవంతపు పెళ్ళికి ఒప్పుకోలేక ఇల్లు వదలి వెళ్ళిపోయాడు. కొడుకు ఇలా అర్థాంతరంగా ఇల్లు విడిచి వెళ్ళిపోవడంతో అతని తండ్రి విశ్వనాధ శాస్త్రి చాలా కుమిలిపోయాడు. ఒక్కగానొక్క కొడుకు. భార్యకూడా తనను ఛీత్కరించుకోవడంతో తన పట్టుదల సడలించుకొని వకుళను కోడలిగా చేసుకోవాలన్న నిర్ణయం తీసుకున్నాడు. ఆ నిర్ణయం 'ఆలస్యం అమృతం విషమే' అయింది. కొడుకు కోసం అతను చేసిన ప్రయత్నాలు ఒకటి రెండూ కాదు. తెలిసిన బంధువులకు, కొడుకు మిత్రులకు టెలిగ్రాములు ఇచ్చాడు. ఉత్తరాలు వ్రాశాడు. పత్రికల్లో ప్రకటనలు ఇచ్చాడు. మనుషులను దేశం నాలుగు చెరగులా కొడుకును వెతకపంపాడు. వాటికి ఫలితం మాత్రం కలుగలేదు. ఈ మనస్తాపంతో మంచంపట్టి అఖరికి కొడుకునే కలవరిస్తూ కన్నుమూశాడు. భర్త చావుతో రామం తల్లికూడా మంచాన పడింది.

ఇప్పుడు...

రెండు సంవత్సరాలు వివిధ ప్రాంతాల్లో తిరిగి విధి ఆడించనట్టు ఆడి, జీవితంమీద అసహ్యం జనించి, నిస్పృహ, నిరాశలతో జీవితంలో ఆత్మహత్యకన్న గత్యంతరం వేరొకటి లేదనకున్న రామం అనుకోకుండా ఒక పాతవారపత్రికలో తన తండ్రి తరఫున ప్రచురించబడిన తనను గురించిన ప్రకటన చూసి, తిరిగి జీవితంమీద ఆశ జనించి తిన్నగా ఇంటికి చేరుకున్నాడు. ఈ రెండు సంవత్సరాలలో జరిగిన సంఘటనలను తెలుసుకొని తన తొందరపాటు వలన తండ్రి హఠాన్మరణానికి చాలా చింతించాడు. తరువాత తల్లి అంగీకారంతో వకుళాసుందరిని పెండ్లి ఆడాడు. కొత్తలో ఉత్సాహంగా

గడిపినా, ఏదో అవ్యక్తమైన బాధ అంతరాంతరాల్లో మనసుని కలిచివేస్తుంటే, ఏదో తీరని అశాంతికి గురి అయి ఎటూ పాలుపోక నిర్లిప్తంగా రోజులు గడుపుతున్నాడు.

★ ★ ★

అంతవరకు వ్రాసిన రామం ముందు కథను ఎలా రాయాలా అన్నది అర్థంకాక అక్కడ ఆపుచేసి కాఫీకోసం ఇంటిలోకి కేకవేశాడు. వెంటనే కాఫీకప్పుతో ప్రత్యక్షమైంది వకుళాసుందరి.

"ఏమిటండీ? అంత దీర్ఘంగా వ్రాసున్నారు. కొంపతీసి కథకాదు కదా?" పరిహాసంగా అడిగింది.

"పరిహాసం కాదు, సుందరీ! కథేరాయాలని ఉపక్రమించాను. అయితే, ఏమి రాయాలో ఎలా రాయాలో తోచటంలేదు. రాయాలని చాలా ఉన్నా, అదేమి చిత్రమో కాని, కాగితంమీద ఒక్క ముక్కకూడా పెట్టలేకపోతున్న అసమర్థుడ్ని పోనీ, కాఫీ తాగితే ఒక దారి తెలుస్తుందేమోనన్న ఆలోచన వచ్చింది. అందుకని!.."

"బాగుందండీ! కాఫీ తాగినంత మాత్రాన ఎక్కడైనా ఆలోచనలు వస్తాయండీ?"

"ఏం, ఎందుకు రావు? అసలు కథలు రాసే వాళ్ళు కాఫీలు, టీలు తాగి, సిగరేట్లు కాల్చి కదూ వ్రాసేది? అలా అని ఎన్ని కథలలో చదవలేదు?"

"అలాగా! ఇంకా నయం, సిగరేట్లు తెమ్మనలేదు. కాఫీతోనే సరిపుచ్చారు. వేగం తాగండి. మళ్ళీ చల్లారిపోతుంది. ఇంతకీ ఏమిటి కథ?"

"ఏది, ఇంతవరకు కథ జరగనేలేదు."

సుందరి భర్త అందించిన రెండు కాగితాలు చూసింది.

"అయితే, అయ్యగారు తమ కథనే వ్రాస్తున్నారన్నమాట! ఇంకేం? మరో ఏనిమిది నెలల్లో రామం తండ్రి కాబోతున్నాడు అని వ్రాసి ముగించేయండి. అయినా, ఇదే కథండీ! ఇందులో ఒక థ్రిల్ లేదు, ఒక సస్పెన్స్ లేదు. పెళ్ళాడాలనుకున్న అమ్మాయిని మొదట్లో అవాంతరాలు వచ్చినా లేటుగానైనా పెళ్ళిచేసుకున్నాడు అని సింపుల్‌గా వ్రాసేశారు. వాస్తవాలు వ్రాసేవాళ్లు అధమం. పేర్లు అయినా మార్చరటండి! ఇలాంటి కథలు పోస్ట్‌మెన్ పత్రికాఫీసు వరకైనా తీసుకపోడు. కంపు కొడుతున్నదని దారిలోనే చించి పారేస్తాడు" అంది వకుళాసుందరి తియ్యగా నవ్వుతూ.

"సుందరీ! మరైతే నే నీ కథను పూర్తిగా రాయలేనా? మరి నామనస్సులోని ఆరాటం, ఏదో రాయాలన్న తపన, చెప్పలేని బాధ నీకెలా చెప్పడం?"

"చెప్పాలనుకుంటే చెప్పలేకేమిటి? అయినా, మీ కేమిటండీ ఆరాటం! నిష్కారణంగా మామయ్యగారు మీ గురించి బాధపడుతూ చచ్చిపోయారు. ఏమైనా అప్పట్లో మీరలా ఇల్లు వదిలి వెళ్ళిపోయి వారిని క్షోభపెట్టడం ఏమీ బాగా లేదండి?" అమె కన్నులు చెమర్చాయి.

"మరేం చెయ్యను? నువ్వెంతకూ రిజిస్టరు పెళ్ళికి ఒప్పుకోలేదు. మా నాన్న తన పట్టు వదులుతారన్న ఆశ నాకప్పట్లో లేశమాత్రం లేదు. అలాంటి సమయంలో నా మనస్సు మనస్సులో లేదంటే నమ్ము. ఇంతకీ నా కథ మాటేమిటి?"

"పోనీ, ఓ సలహా ఇవ్వనా?"

"నిరభ్యంతరంగా!"

"ఆ రెండేళ్ళలోనూ మీరు తిరిగిన ప్రదేశాలు, చూసినవింతలు, మీకు తారసపడిన మనుషుల గురించి విపులంగా వ్రాసేయండి. అందులో ఏమైనా యాత్రాస్థలాల గురించి, ఆయా ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాల గురించి వింతలుంటే పత్రికల వాళ్లే ఎడిట్‌చేసి వ్యాసంలా ప్రచురించేస్తారు. మీకు ప్రతిఫలం కూడా ముట్టుతుంది."

"నువ్వు మరీ వేళాకోళం పట్టిస్తున్నావు. నిజానికి నాకు కథే వ్రాయాలనుంది."

"ఇందులో వేళాకోళం ఏముందండీ! మీ కథలో థ్రిల్, సస్పెన్స్ లేందే? పోనీ, మరో పని చెయ్యండి. 'అబ్బాయి-అమ్మాయి' కథలు వ్రాసే ఏ కొమ్ములు తిరగిన రచయితనైన ఆశ్రయించండి. కుక్కపిల్లా - సబ్బుబిళ్ళ కవిత్వాని కనర్హం కానట్లు మీ అబ్బాయి - అమ్మాయి కథకు ఒక రూపు, రంగు మార్చి అతగాడే పాట్లుపడి ప్లాటు మార్చి వ్రాసేస్తాడు. దండిగా కాఫీ, పలహారాలు ఇప్పిస్తే మీపేరుమీదే పంపడానికి ఒప్పు కుంటాడు. అయినా, మీతో ఇలా కూర్చుందుకు నాకెలా? అవతల బోలెడు చాకిరి ఉంది. నేనొస్తా. మళ్ళీ ఆలోచనలకోసం కాఫీ కావలిస్తే అరగంట ఆగి కేకవేయండి."

"సుందరీ! అంతేనా, నా పాట్లు నన్ను పడమని ఇలా వెళ్ళిపోతావా? నువ్వు నా సరసన ఉంటే ఏమైనా ఐడియాలు తగలకపోతాయా?"

"ఇలా కూర్చోవడానికి మీలా నాకు సెలవు రోజా? సెలవు రోజైనా తొమ్మిది గంటలకు భోజనం, రెండు గంటలకు టిఫిను ఠంచనుగా మీకుపడాలి, నేనొస్తానండీ. అవతల కూరే మాడిపోతున్నదో, ఎసరే ఉడుకుతున్నదో? కొళాయి కట్టివేసే వేళకూడా అయింది. పోనీ, మరో సలహా! అలా వాలుకుర్చీలో మేనువాల్చి సరస్వతిని తలచుకొండి. ఆమె కటాక్షించితే ఆలోచనలకు ఒక దారీతెన్నూ దొరకవచ్చు" చలోక్తిగా అంటూ భర్తను పరిశీలనగా చూసింది వకుళాసుందరి.

రామం గతుక్కుమన్నాడు. అతడి గుండెలో కంపరమొత్తింది.

వకుళ నవ్వుతూ, "అదేమిటండీ, అంతలోనే నీరు కారిపోయారు! నా సలహా బాగా లేదా? చదువుల తల్లి సరస్వతి కాక మీకు కథా రచనలో వేరెవరు సహాయం చేయగలరు? కాళిదాసంతటివాడు ఆ తల్లి చలవ వల్లనే కదా అంత మంచి కావ్యాలు రాయగలిగింది" అంది.

వకుళాసుందరి నిష్క్రమించటంతో అచేతనంగా వాలు కుర్చీలో మేను వాల్చిన రామానికి ముచ్చెమటలు పోశాయి. ఎందుకీకథా ప్రయత్నం అని మనసులోనే వాపోయాడు.

వంట ముగించుకొని భర్తను పిలవడానికి వచ్చిన వకుళ గాఢనిద్రలో మునిగి ఉన్న భర్తను లేపడానికి జంకింది. అతని మొహంమీద చెమట విపరీతంగా పోసి ఉంది. సీలింగ్ ఫాన్ ఆన్ చేసింది. తువ్వాలుతో మొహం మెత్తగా వత్తింది. అయినా, రామానికి తెలివిమాత్రం రాలేదు. మత్తుమందు తిన్నచందాన అదేవిధంగా నిద్రాదేవి ఒడిలో వాలిపోయి ఉన్నాడు. టేబిలుమీద అసంపూర్తిగా వ్రాసి ఉన్న కాగితాలు రెపరెపలాడుతున్నాయి.

వెంటనే టేబిల్‌మీద ఉన్న కాగితాలను ముందు వేసుకొని కూర్చుంది. అల్లిబిల్లిగా వస్తున్న ఆలోచనలను ఒక పరిధిలో పెట్టి తీవ్రంగా ఏదో వ్రాయజొచ్చింది. అలా ఆమె వ్రాస్తుంటే గంటలే గడిచిపోయాయి. రామానికి మెలకువ మాత్రం రాలేదు. మెలకువ రానందుకు మనసులోనే భగవంతునికి నమస్కరించి తను వ్రాసింది మరోమారు పరిశీలనగా చూసింది.

'హే భగవాన్! ఈ జీవితాన్ని సాఫీగా నడిపించే భారం నీది. ఆయనలోని ఆవేదన నాకు అర్థం కానిది కాదు. ఈ పరిస్థితులను ఎదుర్కొనే ఆత్మస్థైర్యాన్ని అతనికి ప్రసాదించు. ఏమైనా నా మాంగల్యానికి ముప్పు రాకుండా కాపాడు. నేను చేసిన ఈ సాహసాన్ని క్షమించు. పర్యవసానం నేను ఊహించినరీతిలోనే జరిగేటట్లు అనుగ్రహించు!" అంటూ భగవంతుణ్ణి అర్థించింది. తరువాత అలసిసొలసి పక్కనే నేలమీద నడుము వాల్చి నిద్రపోయింది.

★ ★ ★

"సుందరీ! నేను రాసింది రెండు కాగితాలే. అయినా చూడు, ఇక్కడ ఎన్ని కాగితాలున్నాయో? అరే, కథ చాలా పెద్దదే ఉంది. కొంపతీసి నువ్వు కాని పూర్తి చెయ్యలేదు కదా?" హడావిడిగా భర్త లేపడంతో తుళ్ళిపడి లేచింది.

"బాగుందండీ కథలు రాయడం నాకు వచ్చేమిటి? మహా అయితే 'ఆసుపత్రులు అవస్థలు', 'అతివలు – ఆడంబరాలు" పిల్లలు – పంతాలు'లాంటి వ్యాసాలయితే రాయగలనేమో! అలాంటివైతే తేలికగా స్కూల్లో కాంపోజిషనులా రాసేయొచ్చు, నాకే మొచ్చుండి కథలూ కాకరకాయలూ!"

"మరి ఈ కథ ఎవరు రాశారంటావు? నిద్రలో లేచి నేనే వ్రాసి ఉండటానికి ఎంతమాత్రం వీలులేదు. ఇది నా దస్తూరి కాదు."

"నేను అన్నట్లు బహుశా ఆ సరస్వతీదేవే స్వయంగా వచ్చి వ్రాసి ఉంటుందేమో? వెనకటికి శ్రీరామచంద్రుడు స్వయంగా వచ్చి పోతనగారి భాగవతం వ్రాసినట్లు."

"నీకు ఏమైనా మతిపోయిందా ఏమిటి? ఇదేమైనా ద్వాపరయుగమా – త్రేతాయుగమా? పచ్చి కలియుగం!"

"నిజమండి. దేవుడిమీద నాకు నమ్మకమున్నా ఈ కాలంలో ఇలాంటివి సంభవంకావు. పోనీ లెండి. ఎలాగైతేనేం? మీకు కావలసింది పూర్తి అయింది. ఇంక భోజనానికి లేవండి, నాకాకలి వేస్తుంది."

"అలా కాదు. ముందు నన్నీ కథను చదవనీయ్."

వకుళ ఉలిక్కిపడింది. కొంచెం తేరుకొని, "దానికేముంది, అన్నం తిన్న తరువాత తాపీగా చదవచ్చు. నేను కూడా వింటాను."అంది.

"లాభంలేదు. నేను ముందే చదవాలి."

వకుళ దిష్టిబొమ్మలా నిలుచుండి పోయింది. రామం గబగబ చదవసాగాడు. ఆమెలో తెలియని భయం అంతకంతకు అధికం కాసాగింది.

★ ★ ★

ఇప్పుడు...

రామం వకుళతో కాపురం చేస్తున్నా అతనిలో తీరని ఆవేదన, వ్యక్తం చేయలేని బాధ రోజురోజుకి అధికం కాసాగాయి. వకుళతో ఏదో చెప్పాలన్న తపన, ఎలా చెప్పడం అన్న భీతాహం, చెప్పి ఆమె ముందు మనిషిగా నిలబడగలనా అన్న సందేహం.

అంతరాత్మ ప్రతి నిమిషం తన్ను దోషిగా నిలబెట్టి కలవర పెడుతుంది. అనుక్షణం తనలో ఏదో శక్తి గతంలోనికి తనను మరలిస్తూ శాంతికి దూరం చేస్తూంది. అప్యాయంగా పలకరించే భార్యకు

మొహం చూపెట్టడానికి మనస్సు ఒప్పటంలేదు. ఆమెకు నువ్వు తీరని ద్రోహం చేశావని ఎదిరించే మనస్సుకు సమాధానం చెప్పే ధైర్యం తనలో లుప్తమౌతుంది. వకుళ ఈ హఠాత్పరిణామానికి కారణం తెలియక తనలో తనే బాధపడసాగింది. ఇలా ఇద్దరి జీవితాలు నానాటికీ దుర్భరంగా తయారయ్యాయి. దీనికి నిష్కృతి లేదా? తను చేసిన తప్పు దిద్దుకొనబడనిదే...

అప్పుడు...

రామం అలా ఇల్లువదిలి తిరిగి తిరిగి కాశీ చేరుకున్నాడు. అక్కడ ఆ విశ్వనాథుని ముందు మోకరిల్లి తన తండ్రిలో పరివర్తనను కలిగించి తనకు, వకుళకు వివాహం జరిగేలా పరిస్థితులను సుముఖం చెయ్యమని భగవంతుణ్ణి అర్థించాలని వచ్చిన రామానికి ఆ నగరంలో అనుకోకుండా సరస్వతితో పరిచయం అయింది. ఆమె, ఆమె తల్లి మగదిక్కు లేకుండా అక్కడ జీవితం గడుపుతున్నారు. ఆమె చిన్నతనంలోనే ఉద్యోగరీత్యా తండ్రి ఆంధ్రప్రదేశం వదిలి ఈ సుదూరప్రాంతానికి వచ్చేశాడు. అనుకోని పరిస్థితుల్లో అతని అకాల మరణం, ఆదరించే ఆత్మబంధువులు ఎవ్వరూ లేని కారణాన సరస్వతి తల్లి కాశీ విశ్వనాథుడ్నే నమ్ముకొని అక్కడే ఉండిపోయింది.

తనను అప్యాయంగా చేరదీసి, స్వంత మనిషిగా ఆదరించి ఆతిథ్యం ఇచ్చారు. కొత్త ప్రదేశంలో ఆప్యాయతతో తనను ఆదరించిన వారి సాహచర్యంలో తన పూర్వ జీవితాన్ని విస్మరించి, వారిలో ఒక్కడై మెలుగుతూ మగదిక్కులేని వారిని ఆదుకున్నాడు రామం. దైవలీలలు అనేకానేకాలు. ఇలా కాలం వెళ్ళబుచ్చుతున్న సరస్వతికి తల్లి కూడా కరవైంది. పేవ్‌మెంట్ మీద జాగ్రత్తగా నడుస్తున్నా ఒక లారీ డ్రైవరు తప్పతాగి నడుపుతున్న కారణాన సరస్వతి తల్లి దెబ్బలు తగిలి ఆసుపత్రిలో కన్నుమూసింది. చనిపోయే ముందు సరస్వతి చేతిని రామం చేతిలో ఉంచుతూ, "బాబూ! నువ్వు ఎవరి బిడ్డవో కాని నిన్ను మా సరస్వతికోసమే ఆ విశ్వనాథుడు పంపి ఉంటారు. నా తల్లి మెడలో తాళి కట్టుతానని మాటివ్వు. నిశ్చింతగా కన్నుమూస్తాను. నీవు కాదంటే తెగిన గాలిపటమౌతుంది దాని జీవితం" అంటూ వెక్కివెక్కి ఏడుస్తూ అర్థించింది. సరస్వతిమీద ఏ విధమైన అభిప్రాయం అంతవరకులేని రామం అనాలోచితంగానే ఒప్పుకున్నాడు. సరస్వతిని ఆ దేవదేవుని సమక్షంలో వివాహమాడతానని మనస్ఫూర్తిగా వాగ్దానం చేశాడు. ఆమె నిర్విచారంగా కన్నుమూసింది. తన మాటను నిలబెట్టుకున్నాడు రామం.

కొత్త అనుభూతులతో కొన్నాళ్ళు ఉల్లాసంగా గడిచిపోయాయి. ఇంతలో వకుళ జ్ఞప్తిపథంలోకి రాగానే తను అనాలోచితంగా చేసిన పనికి బాధపడ్డాడు. సరస్వతి తన్ను దైవంగా ఆరాధిస్తున్నా, వకుళమీది వ్యామోహం అతణ్ణి సరస్వతికి దూరం చేయసాగింది. తాత్కాలికంగా దొరికిన ఉద్యోగం కూడా పోయింది. రోజులు చాలా కష్టంగా నడవసాగాయి. సరస్వతి ఒంటిమీద ఉన్న తగుమాత్రం నగలు కరిగిపోయాయి. ఇలా కొన్ని మాసాలు మాత్రం సరస్వతితో కలిసి ఉన్న రామం తన్ను తాను హీనంగా చూసుకుంటూ, జీవితంమీద విసుగు చెంది తన మనోదౌర్బల్యానికి చింతచెందసాగాడు.

సరస్వతి కారణం తెలియక కుమిలిపోయింది. దీనంగా రోదించసాగింది. దానితో గృహంలో వాతావరణంపూర్తిగా మారిపోయి రామాన్ని పలాయన గతుణ్ణి చేసింది. రామానికి ఈ ప్రపంచంనుంచే శాశ్వతంగా నిష్క్రమిస్తే గాని తనకు విముక్తిలేదన్న భావన కలగసాగింది.

తన ఆలోచనల్ని క్రియాన్వితం చేయ్యాలన్న ప్రయత్నంలో ఉన్న రామం అనుకోకుండా ఒకపాత

పత్రికలో తండ్రి వేయించిన ప్రకటన చూశాడు. తండ్రి తన ఇచ్ఛాపూర్వకమైన వివాహానికి సుముఖంగా ఉన్న వైనం ఆ ప్రకటనద్వారా గ్రహించి, వకుళమీది వ్యామోహాన్ని మరల్చుకోలేక, సరస్వతిని నిర్దాక్షిణ్యంగా వదిలివేసి ఇల్లు చేరుకున్నాడు. తరువాత వకుళను వివాహం చేసుకున్నాడు.

ఇక్కడ –

వకుళా రామంల జీవితం కొన్నాళ్ళు సాఫీగా నల్లేరు మీద బండిలా నడిచిపోయినా, సరస్వతికి చేసిన అన్యాయం తలపుకి రావడంతో రామంలో పెద్ద మార్పువచ్చింది. తను చేసిన ఘాతుకాన్ని వకుళకు తెలియజెయ్యనూలేక, తనలో దాచుకోనూలేక రామం పశ్చాత్తాపాగ్నిలో దహించుకుపోయాడు. భర్తలోని ఈ మార్పుకి వకుళ కుమిలిపోయింది. ఎంత ప్రయత్నించినా ఆమె ఈ మార్పుకి కారణం తెలుసుకోలేక పోయింది. భర్త ఆనందంగా ఉత్సాహంగా ఉండాలన్న ఆరాటంతో ప్రతినిమిషం తనునవ్వుతూ, భర్తను నవ్వింపజేయాలని పాటుపడసాగింది. మనస్సులోని చింతతో రామం ఆమె ప్రయత్నాల వలన మార్పు చెందలేక పోయాడు. పైగా ఆమెకు తనుచేసిన అపచారం అతణ్ణి మరింత క్రుంగదీయసాగింది. ఆమె ఎంత దగ్గరకు రావాలని ప్రయత్నిస్తే అతనంత దూరం తొలగిపోసాగాడు.

అక్కడ...

రామం చెప్పకుండా ఇల్లు వదిలి వెళ్ళిపోవడంతో సరస్వతికి దిక్కుతోచలేదు. తల్లికూడా కరవైంది. పైగా రామాన్ని వివాహం చేసుకున్న ఫలితంగా తల్లికూడా కాబోతూంది. ఒంటరి ఆడది సమాజంలో జీవించటం ఎంత కష్టమో ఊహించలేకపోయింది. రెండు పూటలా తిండికూడా కరవైంది. అయినా, రామంకోసం రోజులు, వారాలు, నెలలు కళ్ళుకాయలు కాచేలా నిరీక్షించింది. ఆమె నిరీక్షణ వ్యర్థమే అయింది. రామంరాక కాదుకదా అతని జాడకూడా తెలుసుకోలేకపోయింది. నవమాసాలు నిండి ఆణిముత్యంవంటి మగశిశువుని కన్నది. నిరాశ్రయంగా తనా నగరంలో ఉండటం రోజురోజుకి క్లిష్టం కావడంతో రామాన్ని అన్వేషిస్తూ బయలుదేరింది.

ముగింపు...

పాఠకమహాశయులారా! ఈ కథను ఇంకా పొడిగించకుపోవడం సబబుకాదు. అయితే, కథ ఇంకా జరగలేదు. ఇందులోని పాత్రలు కల్పితాలు కావు. సజీవాలు. అందువలన ఏదో ఊహించి పూర్తిచేయాలి. లేక కథను అసంపూర్తిగా వదిలివేయాలి. అసంపూర్తిగా వదిలేస్తే ఈ కథ అర్థవిహీనంగా ఉంటుంది, మరెలా?

ఆc! మంచి ఆలోచన స్ఫురించింది.

ఒక వ్యక్తికి సజీవులైన ఇద్దరు భార్యలు ఉండటం తెలుగు సాంప్రదాయం కాదు. తెలుగు సినిమాకథఐతే సరస్వతిని నిలువునా చంపేసి(వాస్తవిక మరణాన్ని కల్పించి), ఆమె పుత్రుణ్ణి రామానికప్ప గించి కథను ముగించివేయవచ్చు. ఒక పురుషుని వంచనకు మోసపోయిన సరస్వతిని నిర్దయగా చంపి వేయడం నాకు సమంజసమనిపించలేదు. సరస్వతిని చంపలేని నేను అదే కారణాన వకుళను కూడా చంపలేను. ఆమె చేసిన తప్పేముంది? రామం అంతకుపూర్వం మరో స్త్రీని వివాహం చేసుకున్నట్లు సూచనమాత్రంగానైనా తెలిసివుంటే తాను రామాన్ని వివాహం చేసుకొని ఉండేది కాదే! రామం చేసిన పాడుపనికి ఆమె నెందుకు చంపాలి?

పోనీ, వీరిద్దర్నీ ఉంచి రామాన్నే కడతేరిస్తే? హరి!హరీ!!ఇలా చేస్తే కథకు న్యాయం చేకూరుతుందేమోకాని, నిష్కారణంగా ఇద్దరు అబలలు నిరాశ్రయులవుతారు. ఇలా ముగించటం సబబా? ఏమిటీ విపత్కర స్థితి? రామం చావాలి! ఇది సాధ్యమా? ఎందుకు సాధ్యం కాదు.

★ ★ ★

అంతవరకు చదివిన రామం కుప్పలా కూలిపోయాడు. "సుందరీ! ఈ కథను నువ్వేనా పూర్తిచేశావు?" రామం ప్రశ్న.

"బాగుందండీ! నేనా?!" వకుళ ఆశ్చర్యంగా చూసింది.

"సుందరీ నాకొక పరిష్కారాన్ని సూచించావు. నీ రాత నాకు తెలియదా? ఇంతకీ నీకీ విషయాలన్నీ ఎలా తెలిశాయి? నే నెప్పుడైనా నిద్రలో కలవరించానా? లేక సరస్వతి నీకు తారసపడిందా? సుందరీ, నిజంగా నేను చాలా దుర్మార్గుణ్ణి. నిర్దాక్షిణ్యంగా ఇద్దరు స్త్రీల జీవితాలతో ఆడుకున్నాను. అయితే, అన్నీ అనాలోచితంగా జరిగిపోయాయి. నేను పర్యవసానాన్ని ఊహించలేదు. పరిస్థితుల ప్రోద్బలంవలన సరస్వతిని పెండ్లాడిన నేను నిన్ను పెళ్లి చేసుకోవటం తప్పు. నీ సాహచర్యంలో సరస్వతి నా తలపుల్లోకి రాదని అపోహపడ్డాను కాని, అది సాధ్యం కాలేదు. ఆమె జీవితం నాశనం చేసిన నేను శాంతికి దూరమయ్యాను. అంతా దైవఘటన. నన్ను క్షమించు. కథలో నువ్వు సూచించిన ముగింపు నాకు నచ్చింది. ఇంతకుమించి వేరొక పరిష్కారమార్గంలేదు, నేను వెంటనే చస్తాను, వకుళా. నేను చచ్చిపోతాను. నన్ను క్షమించానను. లేకపోతే నా ఆత్మకు శాంతి ఉండదు."

"నిప్పును తెలిసి ముట్టుకున్నా తెలియక ముట్టుకున్నా కాలకమానదు. తప్పు తెలిసి చేసినా తెలియకచేసినా హృదయాన్ని కాల్చకమానదు అయితే, నే నాశించిన ముగింపు అది మాత్రం కాదు. మీరు కథను పూర్తిగా చదవకుండానే చచ్చిపోవాలనుకోవడం మీలోని పశ్చాత్తాపానికి సూచకం. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చితం లేదు. దయచేసి ఇంకా మిగిలిపోయిన కథను చదవండి. నా కోర్కె మన్నించి సరస్వతక్కయ్యను తీసుకురండి. అందరం కలిసి ఆనందంగా ఉందాం. ఇంతకుమించిన పరిష్కారం లేదు."

"సుందరీ! నీది ఎంత విశాల హృదయం! సరస్వతికి నా ముఖం ఎలా చూపించను? ఆమె నన్ను అసహ్యించుకోదా? లోకం ఆడిపోసుకోదా?"

"బాగుందండీ! ఇంత కథ నడిపిన మీరు ఇలా భయపడుతున్నారంటే లోకులు నవ్విపోతారు. చేసిన తప్పును దిద్దుకోవడంలోనే ఉంది మానవత్వం. సరస్వతక్కయ్యను ఒప్పించే భారం నాది. మీరు మాత్రం మునుపటి రామంలా తయారవ్వాలి. మీ వేదనను నేను భరించలేను."

"ఇంతకూ సరస్వతీ నీకు తారసపడిందా?"

"చాలా బాగుంది మీ ప్రశ్న. రామాయణం అంతా విని రాముడికి సీత ఏమవుతుందని అడిగాడట వెనకటికి మీలాంటి ఒకడు. ఆమె కనుపించకపోతే మీ ఆవేదన అర్థమయ్యేదా నాకు? నేను మీ కథను పూర్తి చెయ్యగలిగేదాన్నా? ఆమె ఇక్కడే మన పక్కవాటాలో వారం రోజులై ఉంటూంది. రండి, బాబుని చూద్దురుగాని, ముమ్మూర్తులా మీలాగే ఉంటాడు. బుద్ధులు మాత్రం మీవి కాకుండా ఉండాలని ఆ భగవంతుణ్ణి కోరుకోండి."

(ఆంధ్రప్రభ - సచిత్ర వారపత్రిక **27.8.1975**)